# దివ్యంగా ఉంది!

తిక్కల రాజాగారు కుక్కల్ని వెంటబెట్టుకుని వేటకి వెళ్ళిన వారం రోజులకి వెనక్కి తిరిగి వచ్చాడు కోటకి. వస్తూనే గుర్రం దిగుతూ, అంతరంగిక భద్రతా దళాధిపతి సర్వదమనం వీరభద్రయ్య నడిగారు "ఏం  భద్రయ్యా అంద భద్రమేనా" అని

భద్రయ్య భద్రంగా తలాడిస్తూ "చిత్తం ప్రభూ! అంతా దివ్యంగా ఉంది".

"మన చోరగ్రాహి ఎలా ఉన్నాడు?" ప్రశ్నించాడు రాజుగారు. చోరగ్రాహి రాజాగారికి చాల యిష్టమైన జాగిలం. వేటకి వేళ్ళేటప్పుడు దానిని అంతఃపుర రక్షణకి అట్టేపెట్టి వెళ్ళాడు.

"ఆ విషయమే తమతో ఎలా మనవి చేయాలా అని ఆలోచిస్తున్నాను ప్రభూ!" భద్రయ్య చాలా వినయంగా అన్నాడు.

"ఏం! ఏమయింది?" కంగారుగా అడిగారు రాజాగారు.

"ఏమీ లేదు ప్రభూ చచ్చిపోయింది" చల్లగా చెప్పాడు భద్రయ్య.

"ఆ!" అంటూ కుంగిపోయాడు రాజాగారు. కొంతసేపటికి తేరుకుని నీరసంగా "ఎలా చచ్చిపోయింది?" అని అడిగారు.

"మొన్న మనం పదివేలు పెట్టికొన్న అరేబియా గుర్రం బెదిరి గంతులెయ్యడంతో ఆ హడావిడిలో దాని కాళ్ళక్రింద పడి నలిగి చచ్చిపోయింది ప్రభూ!" సమాధానమిచ్చాడు భద్రయ్య.

"అదెలా బెదిరిందోయ్" అర్థం కాలేదు రాజాగారికి.

"ఎలా ఏమిటి ప్రభూ! ప్రధాన వసారా క్రిందనే గదా చావిడి. వసారాలో ఉన్న పట్టుపరదా గుడ్డలు నిప్పంటుకుని జారి దాని మీద పడ్డాయి. దాని ఒళ్ళంతా కాలింది. దాంతో బెదిరింది" వివరించాడు భద్రయ్య.

"ఏమిటీ? కిటికీలకున్న చైనా పరదాలు తగలబడ్డాయా! శ్రీరామచంద్రా" వాపోయాడు రాజాగారు.

"మరి వాటి ప్రక్కనే దీపం పెడితే తగలడవా ప్రభూ" ఓదార్చాడు భద్రయ్య.

"అసలు వాటి ప్రక్కన దీపం ఎందుకు పెట్టారోయ్" చిరాగ్గా అడిగాడు రాజాగారు.



"వాటి ప్రక్కన పెట్టాలని పెట్టలేదు ప్రభూ! తమ అత్తగారిని... క్షమించాలి. రాణిగారి తల్లిగారి తలక్రింద పెట్టారు. ఆవిడ తల అటువైపే ఉంది కదా మరి!! విడమరచాడు భద్రయ్య.

"ఏమిటీ మా అత్తగారి తలక్రింద దీపమా! అంటే ఆవిడ....." అర్ధోక్తిలో ఆగిపోయాడు రాజాగారు.

"చిత్తం ప్రభూ! మరణించారు" భద్రయ్య పూర్తిచేశాడు.

పీడ వదలిపోయిందని సంతోషించాడు రాజాగారు. కాని సందేహం వదల్లేదు శ్రీవారికి. "ఆవిడ అంత తేలిగ్గా చచ్చేరకం కాదే? ఎలా చచ్చింది?" అని పృచ్ఛించారు.

"చిత్తం ప్రభూ! తమరటు వేటకెళ్ళగానే తమరి మిత్రులైన వంగదేశపు సైన్యాధిపతి గారు విచ్చేసారు. ఆయనా, రాణిగారూ కలిసి రాణిగారి తల్లిగారిని తలవైపున ఒకళ్ళు, కాళ్ళవైపున ఒకళ్ళు పట్టుకుని చేపలవాళ్ళు వల విసిరినట్టు గుర్రబ్బండిలోంచి వసారాలోకి విసిరేశారు. ఆ దెబ్బతో గుండె ఆగి మరణించారు ఆవిడ" విన్నవించారు భద్రయ్య.

రాజాగారు మనస్సులో సంతోషించాడు. కాని ఇంతకీ వాళ్ళెందుకు విసిరేయవలసి వచ్చింది ఆవిడని.

అదే అడిగాడు భద్రయ్యని

"చిత్తం ప్రభూ!" వివరిస్తున్నాడు భద్రయ్య! "తమ మిత్రుడైన వంగదేశపు సైన్యాధిపతిగారు, రాణిగారు కలసి కోటలోని జవాహిరీ అంతా బండిలోకి ఎక్కించినప్పుడు ఎంత చెప్పినా వినకుండా ఈవిడగారు కూడా ఆ నాలుగు గుర్రాల బండిలోకి ఎక్కి తాను కూడా వస్తానని మారాం చేయసాగారండి. దాంతో వాళ్ళకి విసుగెత్తి విసిరేశారు ప్రభూ!"

"అదేమిటోయ్!! వాళ్ళు జవాహిరీ అంతా ఎక్కించి ఆ బండిలో ఎక్కడికి పోతున్నట్టు?"

"శాశ్వతంగా వంగదేశం లేచిపోయినట్టే ప్రభూ!"

"? ? ? ? ? ? ??"